# ఆడదాన్ని ఎదగనీయండి

-వేమిరెడ్డి పద్మావతమ్మ

నెల్లూరు రచయితల సంఘం సమావేశానికి హాజరు కావడానికి ఉదయాన్నే నెల్లూరు వెళ్ళాను. సమావేశం.. ప్రముఖుల ఉపన్యాసాలు ఓ కీర్తిశేషుని గ్రంథావిష్కరణ మున్నగు కార్యక్రమాలు పూర్తయి సభ ముగిసేసరికి రాత్రి తొమ్మిది కావచ్చింది. నేరుగా బస్టాంటుకొచ్చాను.

బస్సులు లేవు. రావాల్సినవి ఇంకా రాలేదు. ఓ బెంచీ మీద కూచున్నాను. విసుగ్గా, ఒళ్ళంతా చిరచిరగా వుంది. ఎంత రాత్రయినా, ఇంటికెళ్ళి, స్నానం చేస్తే గానీ, చికాకు తగ్గదు. వేడినీళ్ళు కాచి, ఎదురు చూసే శ్రీమతీ, తెచ్చే మిఠాయిల కోసం ఎదురు చూసే పిల్లలూ గుర్తొచ్చారు.

కాస్త దూరంలో ఓ స్త్రీ కూచునుంది. పచ్చగా, ఎత్తుగా.. కాస్త లావుగా వుంది. ముప్పై... ముప్పై రెండేళ్ళ వయసుండొచ్చు. ఒంటి మీద కొంచెం ఎక్కువే అనిపించేలా నగలున్నాయి. ఒత్తుగా పొడవుగా వున్న వెంట్రుకల్ని బారుజడ వేసుకుని మల్లెపూలు పెట్టు కుంది. ఏమిటో దీర్ఘంగా ఆలోచిస్తోంది. పరిసరాలు గమనించనంత దీర్ఘంగా... అన్ని నగలు పెట్టుకుని, అంత రాత్రిలో ఒంటరిగా ప్రయాణం చేస్తుందంటే కాస్త ధైర్యస్తురాలే అనిపించింది. ఆడవాళ్ళు అలా వుండ డమే నాకిష్టం..

ఓ బిచ్చగత్తె ఎదురుగా నిలబడి చేయి సాచింది.. నెమ్మదిగా, చేతిలో పర్సుతీసి, ఓ నాణెం ఇచ్చింది. మరొకరు- మరొకరు.. నేను చూస్తూనే వున్నాను. విసుక్కోకుండా అందరికీ వేస్తూనే వుంది. ఓ మూగ వాడు సైగలతో అడుక్కుంటున్నాడు. ఓ నాణెం వేసి, సంచి లోంచి రెండరిటి పళ్ళు తీసి, వాడి చేతిలో వుం చింది. వాడు దండం పెట్టి వెళ్ళాడు.

చూస్తూ అనుకున్నాను. 'చాలా నెమ్మదస్తురాలు.. జాలి గుండె గలదీను' అని అక్కడక్కడా కొందరు నిల బడి మాట్లాడుకుంటున్నారు. బస్సులు లేవు... రాత్రి అయింది. అందుకే హడావిడేం లేదు.

ఆమెకి కాస్త దూరంగా ఇద్దరు యువకులు నిలబడి వున్నారు. ఇద్దరి వయసు పాతిక లోపే వుండొచ్చు. ఒకడు తెల్లగా, రింగుల జుత్తుతో వున్నాడు. ఇన్‌షర్టు చేసి వున్నాడు. ముక్కు చప్పగా, నేపాలీ వాళ్ళ ముక్కులా వుంది. చదువుకున్న వాడిలాగానే వున్నాడు. ఆమెకి కాస్త ఇటుగా నిలబడి, స్టైలుగా, సిగరెట్ తాగుతూ, ఆమెవైపే తదేకంగా చూస్తున్నాడు.

కొత్తగా పెళ్ళయిన మగాడు పడకటింట్లో, తన భార్య వంక ఎంత కోరికగా, ఆబగా చూస్తాడో అలా చూస్తున్నాడు.. ఎప్పుడూ, అన్నం మొహం చూడని వాడు, అన్నం కనిపించగానే... ఆ అన్నాన్ని ఎలా పీక్కు తిందామన్నట్టు చూస్తాడో అలా చూస్తున్నాడు. గోతిలోని శవాన్ని వారం రోజులుగా ఆహారం లేని రాబందు ఎలా చూస్తుందో అలా చూస్తున్నాడు...

వాడి ప్రక్కన వాడి తాలూకే మరొకడు. సన్నగా.. పొడవుగా.. రివటలా వున్నాడు. గాలి వీస్తే ఎగిరిపోయే లా వున్నాడు. రకరకాల కోణాల్లో ఆవిడ శరీరాన్ని పరిశీలిస్తున్నాడు. ఇద్దరూ ఇటు తిరిగినట్టు... అటు తిరిగినట్టు... కాస్త తగిలితే చాలు.., కాస్త రాసుకుంటే చాలు.., కాస్త పూసుకుంటే చాలు అన్నట్టు వెంపర్లాడు తున్నారు.

అదేమీ పట్టనట్టు.. తన మానాన తను కూచోనుం దామె. అడుక్కునే బిచ్చగాళ్ళు వస్తే తప్ప, బాహ్య ప్రపం చం పట్టనట్టుంది. ఆ అడుక్కునేవాళ్ళనెలా చూస్తుందో వీళ్ళనీ అలానే చూస్తుందనిపించింది నాకు.

ఇంతలో బస్సొచ్చింది. బిలబిలలాడుతూ జనం దిగారు. భోజనాలకట. తొడ తొక్కిడిగా అందరూ ఎక్కా రు. ఆఖరు సీటులో కిటికీ ప్రక్కగా ఆవిడ కూచుంది. ఎక్కడా ఖాళీల్లేవు. నేను వెళ్ళి పక్కన నిలబడ్డాను.

"కూర్చోండి! ఫరవాలేదు.." అందామె. విశాల మనస్తత్వం కల ఆవిడే అనుకుంటూ... ఒదిగి, ఓ వైపు కూచున్నాను. కాసేపటికి... కిటికీ పక్కగా సం దడిగా అన్పిస్తే కాస్త తొంగి చూశాను. ఇందాకటి వాళ్ళి ద్దరే... కిటికీ దగ్గరగా నిలబడి, సిగరెట్లు తాగుతూ, మాట్లాడ్తున్నారు. నవ్వుతున్నారు. బూతుజోకులు పేలు స్తున్నారు. దూరం నుండి ఎవరైనా చూస్తే... ఆవిడ్ని బస్సెక్కించి వెళ్ళడానికొచ్చిన ఆవిడ తాలూకు వాళ్ళను కుంటారు. అలా వుంది వాళ్ళ ప్రవర్తన.

ఈవిడ వాళ్ళని గమనించకుండా, చెంపకి చెయ్యి జేర్చి, ఆలోచిస్తూ కూచుని వుంది. నెమ్మదిగా, సౌమ్యం గా, అందంగా, మంచితనం మూర్తీభవించినట్టుంది. ఆ అందంలో వెకిలితనం లేదు.. ఆ అలంకరణలో రెచ్చగొట్టేతనం లేదు.. ఆ కట్టూ బొట్టులో ఆడతనం కంటే.. అణకువే కనిపిస్తోంది. ఆలోచిస్తున్నాను. మరి ఇందాకటి నుండి వీళ్ళ ప్రవర్తనకు కారణం ఏమిటా అని.. లొసుగు ఎక్కడుందా అని.. వయసులో వున్న అందమైన, ఆస్తిపరురాలైన ఆవిడ అని తప్ప మరో కారణం నాకు స్ఫురించలేదు.

ఆ ఇద్దరినీ పలకరిస్తూ, మరొకడొచ్చాడు. నల్లగా, లావుగా వున్నాడు. వాడ్ని విడిగా చూస్తే, ఖూనీకోరను కుంటారు. నలుగుర్లో చూస్తే బందిపోటనుకుంటారు. వాడి గుండూ, వాడూ, జైల్లో ఖైదీల్ని వురితీసే వాడిలా వున్నాడు.

రావడమే పకపక, బెకబెక, వెకిలి నవ్వులు నవ్వు తూ వచ్చాడు. "ఒరే! మీ సీట్లెక్కడరా? ఈ కిటికీ దగ్గర నిలబడ్డారేం? ఓరి, వెధవల్లారా? దానికి ఫోజులు కొడు తుండారా?! దాని సర్వీసంత లేదు మీ వయసు. దానికి మీరు ఫోజులు కొట్టడమేందిరా?! ఓహో! వయసున్న ఆడదానితో కంటె... వయసైన దానితో అనుభవం మజాగా వుంటుందనా? ఒరే! అయినా, నాకు తెలియ కడుగుతా... దానికి ఫోజు కొట్టాలంట్రా?! ఓ యాభై పారేస్తే రాదా?! మీకు యవ్వారం తెలియదురా.. ఎదవ ల్లారా?" అంటూ మరోసారి పకపక బెకబెకలాడేడు.

వీళ్ళిద్దరూ గర్వంగా చూస్తున్నారు. మా ముందు సీట్లో వున్న ఒకాయన ఆత్రంగా, వెనక్కి తిరిగి, ఆమెను చూశాడు. కూటికోసం దొంగతనానికెళ్ళిన చిన్న దొంగ, బంగారం ముద్ద దొరికితే.. ఎలా కళ్ళు మెరిపిస్తూ చూస్తాడో అలా కళ్ళు మెరుస్తుండగా చూశాడామెవంక.

ఆమె కిటికీలోనుండి, వాళ్ళ వంక చూస్తోంది. ఏహ్యంగా గజ్జి కుక్కనీ, బురదగుంటనీ, గొంగళి పురు గునీ, చూసినట్టు... ముందు అలికిడి కాగానే, అతన్ని చూసింది. వాడి మొహంలో భావం చూడగానే, తన మొహం గొంగళి పురుగుల్ని చూసినట్టు మారింది. క్రమంగా మొహం జేగురు రంగుకు మారడం ఆ వెలు గులో స్పష్టంగా కన్పిస్తోంది.

ఇంతలో డ్రైవరొచ్చాడు. బస్సు స్టార్టయింది. బిల బిల లాడుతూ, మాకు రెండు సీట్ల ముందుగా, ఆ ముగ్గురూ కూచున్నారు. కూచున్నారే గానీ, వాళ్ళ దృష్టంతా వెనకే వుంది. ఏవేవో మాటలూ.. వెకిలి నవ్వులూ సాగుతూనే వున్నాయి. ఆ సీట్లు వదిలేసి, ఈవిడ సీటు ప్రక్కగా నిలబడమంటే.. హాయిగా ఫీల య్యేలా వుంది వాళ్ళ వాలకం.

రోడ్డెక్కబోతూ, బస్సు కుదుపుకు వెనకున్న వాళ్ళం అరడుగు పైకి లేచాం. "అయ్యో!" అని చిన్నగా శబ్దం చేస్తూ, ఆవిడ చేతితో ముందు సీటు తలపైగా అడ్డంగా వున్న కమ్మీ పట్టుకుంది గట్టిగా! ఆసరాగానూ.. మరి ఎప్పుడు సర్దుకున్నాడో... ఎప్పుడు గమనించాడో ఏమో! ముందు సీట్లుని అతను ఆమె చేతి మీద చేతినానిం చాడు. ఆబగా తడిమినట్టు.. తమకంగా అదిమినట్టు నాకనిపించింది. ఉలిక్కిపడి.. చెయ్యి లాక్కుందావిడ.. బజారు దాటింది బస్సు. బజారు రద్దీ నుండి, రణగొణ ధ్వనుల నుండి కాస్త ప్రశాంతమైన వాతావరణాని కొచ్చినట్టనిపించింది.

ప్రక్కనున్నావిడ లేచింది. బాగ్ సీట్లో పెట్టింది. నాలుగడుగులు వేసింది. రెంటు సీట్లు ముందుగా వున్న వాళ్ళ ముగ్గురి దగ్గరి కెళ్ళింది. కండక్టరు ముందు వు న్న వాళ్ళ టిక్కెట్లు రాస్తున్నాడు. మిగిలిన జనం ఆసక్తిగా ఆవిడ్ని చూస్తున్నారు. నేనూ ఆవిడ్నే చూస్తున్నాను 'ఏమిటా'! అని.

ఆ గుండు వాడినడుగుతోంది. ఏవండీ! మీ పేరే మిటి? మీదేవూరు? అని. వాడి మొహం తెల్లగా పాలి పోయినట్టు, ఆ వెలుగులో దూరానికి కూడా స్పష్టంగా తెలుస్తోంది.

"ఎందుకూ...?" అంటున్నాడు. తడబడిపోతూ... "మిమ్మల్ని ఇంతకు ముందు నేనేనాడూ చూడలేదు. మీకు నేను తెలుసా?" అన్నది.

"ఏమో! మాకేం తెలుసు?" అన్నాడు వాడు.

ఒంగి, కుడిచేత్తో వాడి చొక్కా గుండీలు ఒడిసి పట్టుకుంది. ఒక్క గుంజు గుంజి పైకి లేపింది. తలెత్తి ఆమెనే చూస్తున్నాను నేను. జ్వలిస్తున్న అగ్నిశిఖలా వుంది. కణకణలాడే నిప్పు కణికలా వుంది. కాళికావ తారమెత్తిన కనకదుర్గలా వుంది.

"వెధవా? నీ మొహం నాకు తెలీదు. నా మొహం నీవు చూడలేదు. మరి ఇందాకట్నించీ, నీ వాగుడేమి ట్రా! యాభై రూపాయలు పారేస్తే నేను వస్తానా? అసలు యాభై రూపాయలు ఎప్పుడూనా చూశావట్రా! ఆడదం టే అంత చులకనగా వుందట్రా! ఆడదాన్ని వెతుక్కుం టూ వెళ్ళే కర్మేమిట్రా! వయసైన దానితో అనుభవం మజాగా వుంటుందన్నావుగా. నీ అమ్మ ఇంట్లో అందు బాట్లోనే వుంటుందిగా.. దాని దగ్గరకెళ్ళు. లేదూ,

కుర్రపిల్ల కావాలనుకుంటే... నీ చెల్లెలి దగ్గరకెళ్ళు..." కళ్ళు ఎర్రగా, నిప్పులు కురిపిస్తుంటే... ఆపుకోలేని ఆవేశంతో వూగిపోతూ... అరుస్తోందావిడ...

బస్సాగిపోయింది.. కండక్టరూ, డ్రైవరూ ఆదుర్దాగా పరుగెత్తుకొస్తున్నారు. లేచి దగ్గరకెళ్ళాను "ఏమిటమ్మా! ఆవేశపడకు..." అంటూ ఓదార్చబోయాను.

అప్పుడు జారాయావిడ కళ్ళవెంట కన్నీటి భాష్పాలు. "చూడండి..! మీరు చెప్పండి.. వీళ్ళిలా మాట్లాడబట్టేగా.. ఆ ముందున్న వెధవ నా చేతి మీద చెయ్యి వేయ్యగలిగాడు. ముక్కూ మొహం తెలియని ఆడదాన్ని తాకేంత ధైర్యం వచ్చేలా చేసింది ఈ వెధవల వాగుడేగా..! పోనీ, ఈ వెధవలకు నేను తెలుసా? ఏం లేదు. అసలు ఆడదాన్ని చూస్తే ఇలాంటి లోఫర్లకు తల్లీ చెల్లీ గుర్తురారా! తల్లి చెల్లిని గుర్తుచేస్తేనైనా, ఆడదాని విలువ తెలుస్తుందేమోనని ఇందాక వాళ్ళమ్మనీ, చెల్లెళ్ళీ కించపరిచే మాటలన్నాను. అంతే తప్ప వాళ్ళూ ఆడవాళ్ళేగా.. వాళ్ళనైనా ఎందుకనాలి?

ఈ లోఫర్లే తల్లీ, చెల్లీ పక్కనుంటే.. పరాయి వాడి నీడకూడా తగలకుండా పదిలంగా తీసుకెళ్తారే! మరి పరాయి ఆడదంటే ఎందుకీ చులకన?.

వేదికలెక్కి ఉపన్యాసాలిచ్చే ముందు, మాకు మీతో సమానత్వం ఇచ్చేముందు.. మా పట్ల మొసలి కన్నీరు కార్చేముందు, మా పనులు మేము ధైర్యంగా చేసుకునే ధైర్యమివ్వండి చాలు.. ఎక్కడికైనా, ఏ రాత్రయినా, ఒంటరిగా, ధైర్యంగా ప్రయాణం చెయ్యగలిగే మా ధైర్యాన్ని మెచ్చుకోండి చాలు. అడుగున వున్న ఆడదాన్ని ఎదగనివ్వండి చాలు... కేవలం ఆడదాన్లో స్త్రీత్వాన్నే చూడకండి... తోటి మనిషిగా గౌరవించండి.. ఆదరించండి.. అభిమానించండి.. ఎదగనివ్వండి.. ఆడదాన్ని ఎదగనివ్వండి.."

వాడి చొక్కా వదిలి, రెండు చేతుల్తో మొహం దాచుకుంది. కట్ట తెగిన ప్రవాహంలా ఏడుపు. నెమ్మదిగా తీసుకొచ్చి ప్రక్కనున్న సీట్లో కూచోబెట్టాను.

మొహాన నెత్తురు చుక్కలేనట్లు ముగ్గురు స్నేహితులూ మొహాలు గంటుపెట్టుకుని.. తలలు దించుకుని కూర్చుని వున్నారు. అందరూ వాళ్ళ వంక చీత్కారంగా చూస్తున్నారు. తేలుకుట్టిన దొంగలాగా.. మా ముందున్నవాడు ముణగదీసుకుని కూచున్నాడు.

ఒకరిద్దరైనా ఆడవాళ్ళు ఇలా ధైర్యంగా ఎదురు తిరగకపోతే ఈ సమాజంలో మార్పు రాదు అని మనసులో అనుకున్నానే కానీ, ఏం మాట్లాడలేకపోయాను. చుట్టూ స్థాణువుల్లా జనం... బస్సు కదిలింది. ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు. అందరూ మగవాళ్ళే మరి... ■

## దీపావళి ప్రత్యేక సంచిక!

'పత్రిక' మన మాసపత్రిక మీ అందరి శుభాకాంక్షలతో నాలుగు సంవత్సరాలు పూర్తిచేసుకుని అయిదవ సంవత్సరంలో అడుగుపెట్టనున్నది. దసరా, దీపావళి, పత్రిక జన్మదినోత్సవం కలగలసి రావడం ఆనవాయితీ. ఈసారి నవంబర్ 1వ తేదీన దీపావళి పండుగ వస్తోంది. అందుకని శరత్ శోభలతో, దీపావళి మరియు జన్మదిన ప్రత్యేక సంచిక అక్టోబర్ చివరి వారంలో వెలువడుతుంది.

1/4 డెమ్మీ సైజులో, కళాత్మకమైన కవర్ పేజితో, మరింత నిండుగా, మరిన్ని పేజీలతో ఈ (నవంబర్) దీపావళి పత్రిక మీ ముందుకు వస్తుంది. ఎప్పటిలాగే కథకులు, వ్యాసకర్తలు, కవులు, కార్టూనిస్టులు ఈ సంచిక సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకోడానికి సహకరించాలని కోరుతున్నాము. పండుగ వాతావరణాన్ని మన పాఠకులకు అందించేందుకు అనువైన రచనలను పంపగలరని ఆశిస్తున్నాము. మీ రచనలు అక్టోబరు 1 లోగా చేరితే, ఈ సంచికను పొందికగా కూర్చకలుగుతాం. అందుకు సహకరించాలని ప్రార్థిస్తున్నాము.

అక్టోబరు 1 లోగా మీరు రచనలు పంపవలసిన చిరునామా:

**'పత్రిక'**

**మోనికా పబ్లికేషన్స్**

103- నవ నిర్మాణ నగర్
రోడ్ నెం.71, జూబ్లీహిల్స్
హైదరాబాద్ - 500 033.